రెండో రోజూ గరంగరం

- ప్రజాపాలనంటూ గొప్పలు చెప్పారు.. అర్హుల పేర్లు తీసేశారు..
- గ్రామసభల్లో విడుదల చేసిన జాబితాలో తమ పేర్లు లేకపోవడంతో అధికారులను నిలదీసిన ప్రజలు
- పేర్లు లేనివారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచన
- నామమాత్రంగా దరఖాస్తుల స్వీకరణ

యాచారం గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీడీవో నరేందర్‌రెడ్డి

యాచారం, జనవరి 22 : మండలంలోని ధర్మన్నగూడ, గడ్డమల్లయ్యగూడ గ్రామాల్లో బుధవారం నిర్వహించిన ప్రజాపాలన గ్రామ సభలో గ్రామస్తులు రెచ్చిపోయారు. ధర్మన్న గూడలో అధికారులు విడుదల చేసిన సంక్షేమ పథకాల లబ్ధిదారుల జాబితాలో తమ పేర్లు లేకపోవడంతో అధికారులను నిలదీశారు. గ్రామంలో ఇప్పటికే సుమారు 200 వరకు రేషన్ కార్డుల కోసం పలుమార్లు దరఖాస్తు చేసుకోగా కేవలం ఆరుగురికే నూతన రేషన్ కార్డులు రావడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. రేషన్ కార్డులో కుటుంబ సభ్యుల నమోదు కోసం గతంలో మీ సేవలో దరఖాస్తు చేసుకున్నామని, అవి పెండింగ్‌లో ఉన్నట్లు చూపిస్తున్నాయని మండిపడ్డారు. భూమి ఉన్నోళ్లకు ఇందిరమ్మ భరోసా ఎలా వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. సాగుకు యోగ్యమైన భూములను రైతు భరోసా నుంచి తొలగించారని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగులు, కాంగ్రెస్ నాయకులు, భూస్వాములకు రేషన్ కార్డులున్నాయని.. అర్హులైన పేదలకు రేషన్ కార్డులు లేవని గ్రామానికి చెందిన పుప్పాల శాంతికుమార్ ఎంపీవో శ్రీలతను నిలదీశారు. పథకాల కోసం ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకోవాలని.. వృద్ధులు, దివ్యాంగులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. గతంలో దరఖాస్తు చేసుకున్న లిస్టును, అధికారులు చేసిన సర్వే లిస్టును అప్పగించాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ మధు, ఏఎస్ఐ సక్రూనాయక్ సిబ్బందితో కలిసి అక్కడికి వెళ్లి అధికారులకు అండగా నిలిచారు. సభలో గొడవ చేస్తున్నవారికి నూతనంగా దరఖాస్తు చేసుకోవాలని నచ్చజెప్పి పరిస్థితిని చక్కదిద్దారు. గడ్డమల్లయ్యగూడలో రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాపై కాంగ్రెస్ నాయకులను గ్రామస్తులు నిలదీశారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు సమానంగా ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో రాజకీయ ప్రమేయం లేకుండా చూడాలన్నారు. అర్హులందరికీ న్యాయం చేస్తామని అధికారులు పేర్కొన్నారు. మండలంలోని యాచారం, తులేఖుర్దు, గున్‌గల్, చౌదర్‌పల్లి గ్రామాల్లో కూడా గ్రామసభలను నిర్వహించారు. కార్యక్రమాల్లో ఎంపీడీవో నరేందర్‌రెడ్డి, తహసీల్దార్ అయ్యప్ప, ఎంపీవో శ్రీలత, ఏవో రవినాథ్, ఆయా గ్రామాల ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులున్నారు.

లబ్ధిదారుల ఆగ్రహం

ఆమనగల్లు : రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా పథకాలకు లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు చేపట్టిన గ్రామ సభ ఆమనగల్లు మున్సిపాలిటీలో రసాభాసగా జరిగింది. ఆమనగల్లు మున్సిపాలిటీ 5వ వార్డులో ఉదయం 10 గంటలకు సభ ప్రారంభమైంది. అధికారులు లబ్ధిదారుల జాబితాను వార్డు ప్రజలకు చదివి వినిపించారు. ఆ జాబితాలో పేరు లేని అర్హులు ఆగ్రహావేశాలకు లోనయ్యారు. ఆ జాబితాలో తమలాంటి అర్హుల పేర్లు లేకుండా అనర్హులైన ప్రభుత్వ ఉద్యోగులు, ధనవంతుల పేర్లు ఎలా ఉన్నాయంటూ అధికారులపై మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్న పారదర్శకంగా ఎంపిక చేయాలని లబ్ధిదారులు డిమాండ్ చేశారు. అర్హుల నుంచి వెల్లువెత్తుతున్న నిరసన చూసి కమిషనర్ ముందుగానే వెళ్లిపోయారు. తరువాత అధికారులు తూతూమంత్రంగా దరఖాస్తు ఫారాలు తీసుకుని సభను ముగించారు. సభలో రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అసలైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు కేటాయించాలే తప్ప అనర్హులు, రాజకీయ ప్రమేయం ఉన్నవారికి కేటాయించడం సరికాదని.. మళ్లీ సర్వే చేసి అసలైన లబ్ధిదారులను గుర్తించాలని అధికారులను కోరారు.

ఆమనగల్లు మున్సిపాలిటీ 5వ వార్డులో అధికారును నిలదీస్తున్న వార్డు ప్రజలు

గౌరెల్లిలో లొల్లిలొల్లి

పెద్దఅంబర్‌పేట : మున్సిపాలిటీ పరిధి గౌరెల్లిలో బుధవారం నిర్వహించిన గ్రామ సభలో లొల్లయింది. అనర్హులకు అందలం వేశారని, అర్హులను పట్టించుకోలేదని అధికారులను నిలదీశారు. గ్రామ సభలో అబ్దుల్లాపూర్‌మెట్ డిప్యూటీ తహసీల్దార్ కార్తీక్‌రెడ్డి, మున్సిపల్ ఆర్ఐ అశోక్, గ్రామ కార్యదర్శి శశిధర్ పాల్గొని లబ్ధిదారుల జాబితాను ప్రకటించారు. అందులో అనర్హులే ఎక్కువమంది ఉన్నారని స్థానికులు మండిపడ్డారు. అర్హులైన తమను ఎందుకు లబ్ధిదారులుగా చేర్చలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. గరీబోళ్లను కాదని, పెద్దోళ్లకు పట్టం కట్టారని.. పథకాల్లో పేదోళ్లను మరిచారని ఆరోపించారు.

ఆమనగల్లు : అధికారులతో వాదిస్తున్న వార్డు ప్రజలు

కర్ణంగూడలో..

ఇబ్రహీంపట్నంరూరల్ : రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు రుణ మాఫీ, రేషన్ కార్డులతో పాటు పలు అంశాలపై రెండో రోజు ఇబ్రహీంపట్నం మండలంలోని పలు గ్రామాల్లో గ్రామసభలు గరంగరంగా కొనసాగాయి. పేద ప్రజల జీవితాలతో కాంగ్రెస్ పార్టీ చెలగాటమాడుతున్నదని కర్ణంగూడ గ్రామానికి చెందిన డేరంగుల సత్యనారాయణ గ్రామ సభలో అధికారులను నిలదీశారు. అర్హులందరికీ రేషన్ కార్డులు అందజేయటంతోపాటు రైతు భరోసా పథకాన్ని వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. అలాగే, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీతో పాటు మండల పరిధిలోని పలు గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో ప్రజలు ప్రభుత్వ అధికారులను నిలదీశారు.

ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ 22వ వార్డులో నిర్వహించిన సభలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ స్రవంతి

గ్రామసభలు రసాభాస

కడ్తాల్ : రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలు చేయడానికి గ్రామాల్లో నిర్వహిస్తున్న గ్రామసభలు రసాభాసగా మారాయి. కడ్తాల్‌తోపాటు సాలార్‌పూర్ గ్రామంలో అధికారులు నిర్వహించిన గ్రామ సభలు గందరగోళంగా మారాయి. సభలో అధికారులు వివరాలను తెలియజేస్తుండగా.. లబ్ధిదారుల ఎంపిక సరిగ్గా చేయలేదని ప్రజలు సభకు అడ్డుతగిలారు. అర్హులకు కాకుండా అనర్హులకే సంక్షేమ పథకాలను వర్తింపజేసేలా జాబితాను రూపొందించారన్నారు. ఏ ప్రతిపాదికన జాబితాను రూపొందించారని, లబ్ధిదారుల ఎంపిక ఎలా చేశారని ప్రశ్నించారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు జరిగాయని, ఈజీఎస్ పనులు చేయని వారిని పథకానికి ఎలా ఎంపిక చేస్తారని కూలీలు ప్రశ్నించారు.

మండల కేంద్రంలో ఎంపీడీవో సుజాత అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభలో ఎమ్మెల్యే నారాయణరెడ్డి పాల్గొని మాట్లాడారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందజేస్తామని తెలిపారు. పథకాల అమలు నిరంతర ప్రక్రియ అని, పథకాలు రాలేదని ఎవరూ ఆందోళన చెందవద్దని పేర్కొన్నారు. విడతలవారీగా అర్హులకందరికీ పథకాలను అందజేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ గీత, వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, డైరెక్టర్లు, మండల ప్రత్యేకాధికారి రామేశ్వరీదేవి, ఏవో శ్రీలత, సీఐ శివప్రసాద్, ఎస్ఐ వరప్రసాద్, ఆర్ఐలు, పంచాయతీ కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.

రైతు భరోసా ఏమైంది..

చేవెళ్ల రూరల్ : శంకర్‌పల్లి మండల పరిధి సంకెపల్లి గ్రామంలో పంచాయతీ కార్యదర్శి నరహరి అధ్యక్షతన జరిగిన గ్రామ సభకు ఎంపీడీవో వెంకయ్య హాజరయ్యారు. సభలో గ్రామస్తులు రైతు భరోసా ఏమైంది.. ఎన్ని అప్లికేషన్లు పెట్టుకున్నా దండగే అంటూ అధికారులను నిలదీయడంతో సభలో గందరగోళం నెలకొన్నది. అధికారులు, గ్రామస్తుల మధ్య వాగ్వాదం చోటుచేసుకోవడంతో సర్దిచెప్పినా గ్రామస్తులు అసహనం వ్యక్తం చేశారు. అర్హులకు అందకుండా అనర్హుల జాబితాను చదివి వినిపించడంతో కొందరు గ్రామస్తులు అధికారుల తీరుపై మండిపడ్డారు. ఇదేం పద్ధతి.. అర్హులకు చెందాల్సిన పథకాలు అందడం లేదని వాపోయారు. అధికారులు మధ్యలో కలుగజేసుకొని సర్దిచెప్పారు.

గ్రామ సభల్లో గందరగోళం

మొయినాబాద్ : మండల పరిధిలోని హిమాయత్‌నగర్, బాకారం, సురంగల్, అప్పారెడ్డిగూడ, నక్కలపల్లి, తోలుకట్టా, చిన్నమంగళారం, మోత్కుపల్లి, కనకమామిడి, కాశీంబౌలి, అప్పోజిగూడ గ్రామాల్లో అధికారులు గ్రామ సభలు నిర్వహించి అర్హుల జాబితాను చదివి వినిపించారు. అందులో కొందరి పేర్లు రాకపోవడంతో దరఖాస్తు పెట్టుకున్నా తమ పేర్లు ఎందుకు రాలేదని అధికారులను నిలదీశారు. సురంగల్‌లో ఇందిరమ్మ, రేషన్ కార్డుల జాబితాను చదివే వరకు ప్రజలు ఓపికగా ఉన్నారు. ఆ రెండు జాబితాలు చదివిన తరువాత రైతు భరోసాకు ఎలాంటి వారు అర్హులు అని చదివే లోపు ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల జాబితాలో ఎందుకు తమ పేర్లు రాలేదని అధికారులను నిలదీశారు. జాబితాలో పేర్లు రాని వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని అధికారులు చెప్పడంతో ఎన్నిసార్లు దరఖాస్తు పెట్టాలని అధికారులను ప్రశ్నించారు.

చేవెళ్ల రూరల్ : మోకిలతండా గ్రామ సభలో మాట్లాడుతున్న అధికారి


చేవెళ్ల రూరల్ : సంకెపల్లిలో గ్రామ సభలో ప్రజలను సముదాయిస్తున్న అధికారులు

మొయినాబాద్ : సురంగల్‌లో గ్రామ సభ

వసతి గృహాల్లో పూర్తిస్థాయి సౌకర్యాలు

అందుబాటులో ఉండాలి


బాలంపేట కస్తూర్బాగాంధీ వసతి గృహంలో విద్యార్థినులతో ముచ్చటిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

- వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్
- నియోజకవర్గంలోని పలు ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలను సందర్శించి అధికారులకు ఆదేశాలు జారీ

కొడంగల్/దౌల్తాబాద్, జనవరి 22 : వసతి గృహాల్లో చేపడుతున్న మరమ్మతు పనులు వేగవంతంగా పూర్తి చేయడంతో పాటు పూర్తి స్థాయి సౌకర్యాలు అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు చేపట్టాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులను ఆదేశించారు. బుధవారం నియోజకవర్గపరిధిలోని ఎస్సీ, బీసీ వసతి గృహాలతో పాటు నర్సింగ్ కళాశాలలోని సౌకర్యాలను, దౌల్తాబాద్ మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులతో మాట్లాడుతూ.. వసతి గృహాల్లో విద్యార్థులకు ఇబ్బందులు లేనివిధంగా సౌకర్యాల ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రస్తుతం కొనసాగుతున్న మరమ్మతు పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. మరమ్మతుల కోసం కావాల్సిన నిధులకు ప్రతిపాదనలు అందించాలని సూచించారు. వసతి గృహాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టడంతోపాటు పెయింటింగ్, విద్యుత్ వంటి పనులు చేపట్టాలని తెలిపారు.

దౌల్తాబాద్ మండలం తిమ్మాయిపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రం, బాలంపేట కస్తూర్బా గాంధీ వసతి గృహం, సైన్స్ సెంటర్, గ్రంథాలయం, బీసీ బాలుర వసతి గృహాలను సందర్శించారు. ఆయా పాఠశాలల్లో పరిసరాలు, వంట గదులు, వంట సామగ్రి, డార్మెంటరీ తోపాటు నూతన మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని సూచించారు. స్నానాల గదులు, బెడ్స్, ల్యాబ్, వంట సామగ్రి ఏర్పాటు చేయాలని విద్యార్థులు కలెక్టర్‌ను కోరగా.. విద్యార్థులకు కావలసిన మౌలిక సదుపాయాల ఏర్పాటుకు అంచనా ప్రకారం ప్రణాళిక తయారు చేయాలని సంబధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. దౌల్తాబాద్ మండలంలో కొత్తగా నిర్మించిన గ్రంథాలయ బిల్డింగ్‌ను పరిశీలించి మిగిలిన పనులు వేగవంతంగా పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, తహసీల్దార్లు విజయ్‌కుమార్, గాయత్రి, మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ లిల్లీమేరీ, ఎస్ఐ రవిగౌడ్, వసతి గృహాల అధికారులున్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

వికారాబాద్, జనవరి 22 : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేయడమే ప్రభుత్వ లక్ష్యమని, సంక్షేమ పథకాల అమలు నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. బుధవారం వికారాబాద్ మున్సిపల్‌పరిధి మద్గుల్ చిట్టంపల్లి 8వ వార్డులో ఏర్పాటు చేసిన ప్రజా పాలన వార్డు సభలో కలెక్టర్, మున్సిపల్ చైర్మన్ మంజులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అందించే రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు సంక్షేమ పథకాలకు అర్హుల ఎంపిక కోసం వార్డు సభలు నిర్వహిస్తున్నారని తెలిపారు. వార్డు సభల్లో ప్రకటించిన జాబితాలో మీ పేర్లు లేకుంటే మళ్లీ దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారికే కాకుండా, ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకోని వారు కూడా ఇప్పుడు నిర్వహిస్తున్న వార్డు సభల్లో దరఖాసు చేసుకోవచ్చని, ఇది నిరంతర ప్రక్రియ అని కలెక్టర్ తెలిపారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్, ఫ్లోర్ లీడర్ సుధాకర్‌రెడ్డి, కౌన్సిలర్ గోపాల్, అధికారులు పాల్గొన్నారు.


మద్గుల్ చిట్టంపల్లి వార్డు సభకు హాజరైన ప్రజలు

నిరంతరంగా పోలీస్ టాస్క్‌ఫోర్స్ అధికారుల దాడులు

ఇసుక, కలప ట్రాక్టర్లను పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

వికారాబాద్, జనవరి 22 : అక్రమ రవాణాపై జిల్లాలో నిరంతరంగా టాస్క్ ఫోర్స్ అధికారుల దాడులు ఉంటాయని ఎస్పీ నారాయణరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు జిల్లాలోని యాలాల పోలీస్‌స్టేషన్ పరిధిలోని రస్సాం గ్రామ శివార్లలో అనుమతి లేకుండా కలప రవాణా చేస్తున్న ట్రాక్టర్, విశ్వనాథ్‌పూర్ గ్రామ శివారులో నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న 4 ఇసుక ట్రాక్టర్‌లను కూడా పట్టుకొని కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. జిల్లాలో ఎక్కడైనా అసాంఘిక కార్యక్రమాలు, అక్రమ రవాణాలు జరిగితే వెంటనే టాస్క్‌ఫోర్స్ అధికారులను సంప్రదించాలని ఎస్పీ తెలిపారు.

పౌష్టికాహారం పక్కదారి

దోమ అంగన్‌వాడీ టీచర్‌ను నిలదీస్తున్న కాలనీవాసులు

దోమ, జనవరి 21 : దోమ మండల కేంద్రంలోని అంబేద్కర్‌నగర్ అంగన్‌వాడీ సెంటర్‌లో గర్భిణులు, బాలింతలు, కిశోర బాలబాలికలకు అందించే పౌష్టికాహారం పక్కదారి పట్టిన విషయం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ విషయం తెలుసుకకున్న కాలనీవాసులు యాదగిరి, కృష్ణ, హరిబాబు, అంజిబాబు అంగన్‌వాడీ సెంటర్‌కు వెళ్లి అంగన్‌వాడీ కార్యకర్త నిర్మలను నిలదీశారు. ఓ ఫీల్డ్ అసిస్టెంట్‌కు అంగన్వాడీ సెంటర్ తాళాలిచ్చి, అందులోనుంచి పౌష్టికాహారం అక్రమంగా తరలించడం ఏంటని స్థానికులు ఆమె తీరుపై మండిపడ్డారు. మండలంలో ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం కారణంగానే అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యకర్తలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని కాలనీవాసులు ఈ విషయంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

ఎన్‌టీఆర్ మోడల్ పాఠశాలలో అన్యమత ప్రచారం

విద్యార్థుల తల్లిదండ్రులు.. హిందూ సంఘాల ఆందోళన

ఎన్‌టీఆర్ మోడల్ కళాశాల డీన్ రామారావుకు ఫిర్యాదు చేస్తున్న తల్లిదండ్రులు, హిందూ సంఘాలు

మొయినాబాద్, జనవరి 22 : మొయినాబాద్ మండల పరిధిలోని హిమాయత్‌నగర్ గ్రామంలో ఉన్న ఎన్‌టీఆర్ మోడల్ పాఠశాలలో గత కొంత కాలంగా అన్యమత ప్రచారం కొనసాగుతున్నది. విషయం బయటకు రావడంతో విద్యార్థుల తల్లిదండ్రులు.. హిందు సంఘాలు బుధవారం పాఠశాల ఆవరణంలో ఆందోళన చేపట్టారు. పాఠశాలలో పనిచేస్తున్న డేవిడ్, ప్రభాకర్, లింగం అనే ఉపాధ్యాయులు విద్యార్థులకు పాఠాలు బోధించడంతోపాటు అన్యమత ప్రచారానికి దిగారు. కొన్ని రోజులుగా హిందూ దేవుళ్లపై పలు రకాలుగా ఆరోపణలు చేస్తూ విద్యార్థులను రెచ్చగొట్టేలా వ్యవహరిస్తున్నారు. ఆ ముగ్గురి ఉపాధ్యాయుల నుంచి అవమానాలు ఎదుర్కొంటున్న విద్యార్థులు తల్లిదండ్రులకు చెప్పడంతో బుధవారం తల్లిదండ్రులు.. హిందు సంఘాల నాయకులు వచ్చి ఆందోళన చేపట్టారు. గతంలో కూడా ఉపాధ్యాయులు అన్యమత ప్రచారం చేయడం మొదలు పెట్టడంతో వ్యతిరేకించి.. హెచ్చరించినా ఉపాధ్యాయుల్లో మార్పు రావడం లేదని హిందు సంఘాలు మండిపడ్డాయి. ప్రిన్సిపాల్ కార్యాలయంలో కూడ అన్యమత ప్రచారానికి సంబంధించిన ఫొటోలు ఉండటంతో హిందు సంఘాల నాయకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. విద్యాలయంలో అన్యమత ప్రచారం చేస్తున్నారా.. లేక విద్యార్థులకు చదువులు చెబుతున్నారా అని హిందు సంఘాలు మండిపడ్డాయి. లక్షల రూపాయలు ఫీజులు చెల్లించి చదివించేది అన్యమతాలను స్వీకరించడానికా అని మండిపడ్డారు. ఇలాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలకు వెనుకాడేది లేదని హెచ్చరించారు. అన్యమత ప్రచారానికి తెరలేపిన ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని పాఠశాల, కళాశాల డీన్ రామారావుకు హిందు సంఘాలు, తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. పాఠశాల యాజమాన్యం దిగి వచ్చి అన్యమత ప్రచారానికి పాల్పడిన ఉపాధ్యాయులతో తప్పయిందని చెప్పించడంతో వారు ఆందోళన విరమించారు.

జిల్లాలో సదరం క్యాంపులు

వికారాబాద్, జనవరి 22 : దివ్యాంగులు సదరం క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వికారాబాద్ ప్రభుత్వ దవాఖానలో ఈ నెల 28న అంధులకు, 30న అంగవైకల్యం ఉన్నవారికి పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. తాండూరు ప్రభుత్వ దవాఖానలో 24న అంగ వైకల్యం, 29న చెవుడు, మూగ, 30న బుద్ధి మాంద్యం గల సభ్యులకు సదరం క్యాంపులు నిర్వహించనున్నట్లు తెలిపారు. రెన్యువల్ చేసుకోదలచినవారు మీ సేవలో స్లాట్ బుక్ చేసుకొని/ప్రస్తుతం స్లాట్ బుక్ చేసుకున్నవారు మెసేజ్ ప్రకారం ఆయా తేదీల్లో క్యాంపులకు సకాలంలో హాజరు కావాలని కలెక్టర్ సూచించారు.

కాంగ్రెస్‌లో దొంగలున్నారు..

తాండూరు, జనవరి 22 : బుధవారం తాండూరు మున్సిపల్ పరిధిలోని 13వ వార్డు గ్రీన్ సిటీలో నిర్వహించిన వార్డు సభలో కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డిపై ఫైర్ అయ్యారు. బీఆర్ఎస్ పార్టీలో ఉండి గెలిచి.. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే వెళ్లడం ఏమిటని ప్రశ్నించారు. కాంగ్రెస్‌లో అందరూ దొంగలే ఉన్నారని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో అభివృద్ధి జరిగితే కాంగ్రెస్ వచ్చాక అభివృద్ధి జరిగిందని చెప్పడం సిగ్గుచేటని విమర్శించారు. ఎన్నికల్లో ప్రజలకు మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందన్నారు. అతి త్వరలో జరిగే పంచాయతీ, మున్సిపాలిటీ ఎన్నికల్లో రేవంత్ సర్కార్‌కు తగిన బుద్ధి చెబుతామన్నారు. దీంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు వాగ్వాదం చేసుకున్నారు. పోలీసులు, మున్సిపల్ అధికారులు ఇరువర్గాలకు నచ్చజెప్పడంతో వివాదం సద్దుమణిగింది.

13 కిలోమీటర్లు.. 10 మెట్రో స్టేషన్లు

సిటీబ్యూరో : రెండో దశ మెట్రో విస్తరణలో భాగంగా చేపట్టనున్న మియాపూర్-పటాన్‌చెరు మెట్రో వివరాలను హైదరాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రో అథారిటీ వెల్లడించింది.మియాపూర్ నుంచి పటాన్ చెరు వరకు 13 కి.మీ మేర మెట్రో నిర్మించే ఈ మార్గంలో రాబోయే మెట్రో స్టేషన్ల వివరాలను అధికారికంగా మెట్రో సంస్థ వెల్లడించింది. 13 కి.మీ అందుబాటులోకి వచ్చే మెట్రో మార్గంలో 10 స్టేషన్లతో డెవలప్ చేయనున్నారు. మియాపూర్ నుంచి పటాన్‌చెరు వరకు ఎలివేటెడ్ కారిడార్‌లోనే మెట్రో రాకపోకలు నిర్వహించనున్నారు. ఫేస్-2లో నిర్మించనున్న కారిడార్ -7లో ఉన్న మియాపూర్-పటాన్‌చెరు మెట్రో నిర్మాణానికి రూ.4107 కోట్లు ఖర్చు చేయనున్నారు. మియాపూర్ మెట్రో స్టేషన్ నుంచి మొదలుకుని మియాపూర్ క్రాస్ రోడ్డు, అల్విన్ క్రాస్ రోడ్డు, మదీనాగూడ, చందానగర్, బీహెచ్ఈఎల్, జ్యోతినగర్, బీరంగూడ, ఆర్‌సీపురం, ఇక్రిసాట్, పటాన్‌చెరు స్టేషన్లను నిర్మించనున్నారు. ఈ మార్గంలో 2028 నాటికి కనీసం 1.65లక్షల మంది ప్రయాణించే అవకాశం ఉన్నట్లు మెట్రో సంస్థ అంచనా వేసింది. హైదరాబాద్ నుంచి సంగారెడ్డి జిల్లాలను మెట్రో అనుసంధానం చేయనున్నారు. పారిశ్రామిక కారిడార్‌గా గుర్తింపు పొందిన ఈ మార్గంలో ప్రస్తుతం ఆర్టీసీ, ప్రైవేటు వాహనాలే ప్రధాన రవాణా సదుపాయాలు పొందుతుండగా.. అందుబాటులోకి వచ్చే మెట్రోతో మియాపూర్ నుంచి పటాన్‌చెరు మధ్య ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించడంలో మెట్రో కీలక పాత్ర పోషించనున్నది.